ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 01.11.2025 సమయం : 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలో అంకుర పరిశ్రమలు, విద్య, శాస్త్ర సాంకేతిక రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని కెనడా, ఫ్రాన్స్ హైకమిషనర్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.
2. పౌరుల ప్రాథమిక హక్కుల పరిరక్షణ, సత్వర న్యాయం అందించడమే న్యాయ వ్యవస్థ ధ్యేయం కావాలని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ అన్నారు.
3. మీడియా, వినోద రంగానికి వేవ్స్ బజార్ ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు.
4. వచ్చే రెండు రోజుల్లో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

---------------------------------

**ముఖ్యమంత్రి భేటీ**

రాష్ట్రంలో అంకుర పరిశ్రమలు, విద్య, శాస్త్ర సాంకేతిక రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని కెనడా, ఫ్రాన్స్ హైకమిషనర్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఈ రోజు కెనడా హైకమిషనర్ క్రిస్టోఫర్ కూటర్, ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ మార్క్ లామీ బృందాలు ముఖ్యమంత్రితో భేటీ అయ్యాయి. ఐటీ, ఫార్మా, ఏరో స్పేస్, డిఫెన్స్, అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్‌లో రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై ఈ బృందాలు చర్చించా . ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఫ్రెంచ్ బ్యూరో కార్యాలయాన్ని మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

**డెస్క్**

-------------------------

**ములుగు జిల్లా**

పౌరుల ప్రాథమిక హక్కుల పరిరక్షణ, వారికి సత్వర న్యాయం అందించడమే న్యాయ వ్యవస్థ, కోర్టుల ధ్యేయం కావాలని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్ అన్నారు. రాజ్యాంగంలోని 21 అధికరణ ప్రకారం ప్రతి పౌరుడికి న్యాయం అందించడమే కోర్టుల లక్ష్యమని ఆయన అన్నారు. ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ములుగు జిల్లా కోర్టు భవన నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో ఆయన వర్చువల్ గా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వేణుగోపాల్, జస్టిస్ రాజేశ్వరరావు, జిల్లా న్యాయమూర్తి సూర్యచంద్ర కళ పాల్గొన్నారు.

**పీటీసీ – ములుగు**

----------------------------

**ఎమ్మెల్యేల అనర్హతపై విచారణ**

పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న పది మంది ఎమ్మెల్యేల అనర్హతపై విచారణ పూర్తిచేయడానికి మరో రెండు నెలల గడువు ఇవ్వాలని తెలంగాణ అసెంబ్లీ కార్యదర్శి సుప్రీంకోర్టును కోరారు. ఈ మేరకు సుప్రీంకోర్టులో అప్లికేషన్ దాఖలు చేశారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ భారత రాష్ట్ర సమితి పార్టీ దాఖలు చేసిన పిటిషన్లపై 3 నెలల్లోపు విచారించి నిర్ణయం వెలువరించాలని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం జులై 31న తీర్పు వెలువరించింది. దాని ప్రకారం అక్టోబరు 31లోపు స్పీకర్ తన నిర్ణయాన్ని వెలువరించాల్సి ఉంది. ఇప్పటివరకు నలుగురు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ విచారణ పూర్తిచేసి, తీర్పు రిజర్వు చేశారని అసెంబ్లీ కార్యదర్శి సుప్రీంకోర్టుకు తెలియజేశారు.

**డెస్క్**

-------------------------

**ఆధార్ అప్ డేట్**

ఆధార్ అప్ డేట్స్ కి సంబంధించి నేటి నుంచి మార్పులు చోటు చేసుకున్నాయి. ఆధార్ లో పేరు, అడ్రస్,పుట్టినరోజు, ఫోన్ నెంబర్ ను సేవా కేంద్రానికి వెళ్లకుండ ఇంటి నుంచే ఆన్ లైన్ లో 75 రూపాయల రుసము చెల్లించి మార్చుకోవచ్చు. ఫింగర్ ప్రింట్, ఐరిస్, ఫోటో అఫ్ డేట్ కోసం మాత్రం సేవా కేంద్రాలకు వెళ్లాలి. ఆధార్ కు పాన్ ను ఈ సంవత్సరం డిసెంబర్ 31 లోగా అనుసంధానం చేసుకోవాలి.

**డెస్క్**

------------------------

**WAVES Bazaar**

మీడియా, వినోద రంగానికి వేవ్స్ బజార్ ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. హైరాబాద్ లో జరుగుతున్న ఇండియా జాయ్ 2025 సమావేశంలో వేవ్స్ బజార్ ను ఆయన ప్రారంభించారు. వినోద రంగానికి విస్తృత ప్రయోజనాలను కల్పించే వేవ్స్ బజార్ విక్రేతలను, కొనుగోలుదారులను ఒకే వేదికపైకి తీసుకురావడానికి దోహదం చేస్తుందని అన్నారు. ఓటీటీ కొనుగోలుదారులు కూడా వేవ్స్ బజార్ ఫ్లాట్ ఫాంలోకి వచ్చి అన్ని భాషలలో తగిన మార్కెటింగ్ సదుపాయాన్ని పొందవచ్చని ఆయన అన్నారు.

**Soundbyte- Sanjay Jaju**

**MSL**

--------------------------

**ఇస్రో**

రేపు సాయంత్రం 5.26 గంటలకు 4 వేల 410 కేజీల బరువైన CMS-03 ఉప గ్రహాన్ని LVM3 –M5 ద్వారా ఇస్రో నింగిలోకి పంపనుంది. భారత నౌకాదళ అవసరైల కోసం అభివృద్ధి చేసిన ఈ

కమ్యూనికేషన్ ఉప గ్రహాన్ని శ్రీహరి కోటలోని రెండవ లాంచ్ ప్యాడ్ నుంచి ప్రయోగిస్తారు. ఈ రోజు సాయంత్రం 5 గంటల 26 నిమిషాలకు కౌంట్ డౌన్ ప్రారంభమవుతుంది.

**డెస్క్**

---------------------

**నల్లగొండ జిల్లా**

నల్గొండ జిల్లాలో మొంథా తుఫాన్ వల్ల తడిచిన సుమారు 2 వేల 653 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు.. తుఫాన్ ప్రభావంతో జిల్లాలోని పది మండలాల పరిధిలో వివిధ కొనుగోలు కేంద్రాల్లో సుమారు 4 వేల 600 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం తడిసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఇందులో రైతులు కొంత ధాన్యాన్ని ఆరబెట్టగా మిగిలిన తడి ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు.. అలాగే ధాన్యం విక్రయించిన రైతుల వివరాలను టాబ్ ఎంట్రీల ద్వారా నమోదు చేసి, వారికి రావలసిన మొత్తం డబ్బులను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశామన్నారు. రైతులు తమ పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో విక్రయించుకోవడం ద్వారా పూర్తి మద్దతు ధర పొందవచ్చని కలెక్టర్ సూచించారు.

**పీటీసీ – నల్గొండ**

---------------------

**రాజన్న సిరిసిల్ల జిల్లా**

ప్రభుత్వ వైద్యశాలల్లో సహజ ప్రసవాల సంఖ్య పెంచేందుకు వైద్య ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగర్వాల్ అన్నారు. వేములవాడ మండలం హన్మాజీపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గర్భిణీలు ప్రభుత్వ వైద్యశాలల్లో పేర్లు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని, నిరంతర వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు చేసుకునేలా వారని ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించి, సీజనల్ వ్యాధులు, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పై తగిన అవగాహన కల్పించాలని సూచించారు.

**పీటీసీ - రాజన్న సిరిసిల్ల**

----------------------

**కవిత**

ఇటీవల వర్షాలకు నష్టపోయిన పంటలకు సంబంధించి రైతులకు ఎకరానికి 50 వేల రూపాయల పరిహారాన్ని అందించాలని.. తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాగృతి జనంబాట కార్యక్రమంలో భాగంగా ఆమె కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని మక్తాపల్లిలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలించారు.

**డెస్క్**

--------------------

**కరీంనగర్ జిల్లా**

10 సంవత్సరాలకు పైగా బ్యాంక్ ఖాతాల నుండి క్లెయిమ్ చేయని డబ్బును తిరిగి క్లెయిమ్ చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక అవగాహనా కార్యక్రమం చేపట్టినట్లు కలెక్టర్ పమెల సత్పతి తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనే మొదటి సారిగా కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియం మీ డబ్బు మీ హక్కు పేరిట అన్ క్లెయిమ్డ్ డబ్బును తిరిగి పొందటానికి నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు బ్యాంక్ ఖాతాదారులు పాల్గొన్నారు. గత 10 సంవత్సరాలలో వినియోగంలో లేని అకౌంట్లలో నగదు ఆర్బి ఐ పరిధిలోకి వెళ్లిందని, అలాంటి ఖాతాలలో ఉన్న డబ్బును తిరిగి పొందటానికి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ 3 నెలల అవగాహన కార్యక్రమాలు చేపట్టిందని కలెక్టర్ అన్నారు. దీనిని ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

**బైట్ - పమెల సత్పతి – కలెక్టర్**

**పీటీసీ – కరీంనగర్**

**--------------------**

**తిరుమల**

తిరుమల శ్రీవారి సేవను మరింతగా విస్తృతం చేసేందుకు దేవస్థానంలోని అన్ని వైద్యశాలలో శ్రీవారి వైద్య సేవను ప్రారంభించడానికి  తిరుమల తిరుపతి దేవస్థానం చర్యలు చేపట్టింది.ప్రస్తుతం శ్రీవారి సేవలకు అవకాశం కల్పిస్తున్న తరహాలోనే డాక్టర్లు, వైద్య సిబ్బందికి ఆన్లైన్లో శ్రీవారి సేవ చేసుకునే అవకాశం కల్పించాలని TTD నిర్ణయించింది. అవసరమైతే వారికి శిక్షణ ఇచ్చి, అనంతరం వారి సేవలను వినియోగించుకునేలా  ప్రణాళికలు రూపొందించాలని టీటీడీ కార్యనిర్వహణాధికారి అనిల్ కుమార్ అధికారులను ఆదేశించారు.

**డెస్క్**

**------------------------**

**ఇంటర్మీడియట్ పరీక్షల ఫీజు**

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల ఫీజును ఈరోజు నుంచి స్వీకరిస్తున్నారు. ఎలాంటి ఆలస్య రుసుము  లేకుండా ఈ నెల 14 వరకు ఫీజు చెల్లించవచ్చు. 100 రూపాయల ఫైన్ తో ఈనెల 16 నుంచి  24 వరకు, 500 రూపాయల జరిమానా తో ఈనెల 26 నుంచి డిసెంబరు ఒకటి వరకు, 2వేల రూపాయల జరిమానా తో డిసెంబర్ 10 నుంచి 15 వరకు ఫీజును స్వీకరిస్తారు.

**డెస్క్**

**--------------------------**

**DRDL**

హైదరాబాద్ లోని డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ లాబరేటరీ – డీఆర్డీఎల్ డైరెక్టర్ గా సీనియర్ శాస్త్రవేత్త అంకతి రాజు నియమితులయ్యారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మెకానికల్ ఇంజనీరింగ్, ముంబై ఐఐటీ నుంచి ఎంటెక్  పూర్తి చేసిన రాజు గత మూడు దశాబ్దాలుగా  పృధ్వీ, అగ్ని, మిషన్ శక్తి వంటి కీవక ప్రాజెక్టులలో ఆయన ముఖ్య పాత్ర పోషించారు. తెలంగాణ ప్రభుత్వం నుంచి ఉత్తమ శాస్త్రవేత్తగా ఆయన గతంలో అవార్డు అందుకున్నారు.

**MSL**

--------------------------

**వాతావరణం**

రాగల 48 గంటల్లో తూర్పు మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడ నుందని భారత వాతావరణ విభాగం వెల్లడించింది. దీని ప్రభావంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. తెలంగాణలో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది.

**డెస్క్**

-----------------------